



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 30-5-2025

సంపుటి: 21 సంచిక: 57

పేజీలు: 8 వెల: రూ.1









# సొంత అజెండాతో బదిలీల దందా!




దరఖాస్తు

మహారాజశ్రీ గౌరవనీయులైన శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ వారి దివ్య సముఖమునకు నమస్కరిస్తూ వ్రాయు దరఖాస్తు విన్నపములు

ఆర్యా!

నేను అనగా టెక్కలి. కృష్ణారావు వసతి గృహ సంక్షేమ అధికారి గా ప్రభుత్వం బాలుర వసతి గృహం sw ఖురిగాం నందు తేది 28-11-2017 జాయిన్ అయ్యి సుమారు 7సంవత్సరాల 6నెలల 3రోజులు సర్వీస్ ను పూర్తి చేసియున్నాను. ప్రస్తుత జనరల్ ట్రాన్స్ఫర్-2025 మా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ Dsewo-శ్రీకాకుళం వారు Hwo ల ట్రాన్స్ఫర్ కౌన్సిలింగ్ మాకు పెట్టలేదు పిలవలేదు,తనకి అనుకూలంగా ఉండే వారికి తనకి నచ్చిన స్టేషన్ లు రిటన్సన్స్ లక్షల్లో డబ్బులు ఇచ్చిన వారికి ఇచ్చేస్తున్నారు. నేను సీనియర్ ని అయినను నాకు అవకాశం ఉన్ననూ నేను కోరిన స్టేషన్ నాకు ఇవ్వకుండా నాకంటే 6సం. లు జూనియర్ కి ఇచ్చేస్తున్నారు.పై విషయాలు ను పరిగణలోకి తీసుకొని తగిన న్యాయం చేస్తారని పై ఏలినవారికి మిక్కిలి వినయపూర్వకం గా ప్రార్థిస్తూయున్నాను.

కృతజ్ఞతలు

ఇట్లు

తమవిధేయులు

టెక్కలి. కృష్ణారావు

Hwo ప్రభుత్వ బాలుర వసతిగృహంsw

ఖురిగాం

To

DRO, Srikakulam

- ★పలు శాఖల్లో అధికారులదే ఇష్టారాజ్యం
- ★కౌన్సెలింగుల్లేకుండా ఇష్టారాజ్యంగా జాబితాలు
- ★సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల్లో ఉద్యోగ నేతల ద్వారా తతంగం
- ★రాష్ట్ర నేతనంటూ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సీసీ పైరవీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మార్గదర్శకాలు జారీచేసినా జిల్లా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరికి నచ్చినట్లు వారు సొంత లాభం చూసుకుని ఇష్టారాజ్యంగా బదిలీల జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు జోరందుకున్నాయి. ఈ వ్యవహారంలో ఉత్తర, దక్షిణలు ప్రధాన పాత్ర పోషిస్తుండగా.. కొందరు మాజీలు ఉద్యోగ సంఘాల నాయకులమంటూ బదిలీ దందాలో కాసుల వేట సాగిస్తున్నారని తెలిసింది. మే 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చింది. ఒకేచోట ఐదేళ్లుగా ఉంటున్నవారిని కచ్చితంగా బదిలీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నా చాలా శాఖల అధికారులు ఆ మేరకు బదిలీ ప్రక్రియ చేపట్టడంలేదు. ఒకేచోట ఐదేళ్ల లోపు ఉన్న ఉద్యోగులకు రిక్వెస్ట్ బదిలీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వచ్చే ఏడాది మే 31లోపు రిటైర్ అయ్యే వారికి బదిలీల నుంచి మినహాయించారు. అంధ ఉద్యోగులు, మానసిక సమస్యలున్న పిల్లల తల్లిదండ్రులకు, ట్రైబల్ ఏరియాలో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పని చేసినవారికి, మెడికల్ గ్రౌండ్‌లో బదిలీలు కోరేవారికి, వితంతు ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవాలని, అలాగే స్పౌజ్ కేటగిరీలోని వారికి ఒకేచోట లేదా దగ్గరి ప్రాంతాల్లో పని చేసే అవకాశం కల్పించాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే దీనిపై ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో బదిలీ కోరుకునేవారు ఎవరికివారుగా ప్రయత్నిస్తూ.. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు సమర్పించినా కోరుకున్న చోటుకు బదిలీ అవుతుందన్న గ్యారెంటీ లేదని ఉద్యోగవర్గాలు చర్చించుకుంటున్నాయి. కాగా కొన్ని శాఖల్లో ఉద్యోగ సంఘాల నాయకులే ఎవరిని ఎక్కడికి బదిలీ చేయాలో సూచిస్తూ జాబితాలు తయారుచేసి జిల్లా అధికారులకు సమర్పించేశారు.

### కౌన్సెలింగ్ లేకుండానే జాబితా

చాలా శాఖల్లో మంత్రి, ఎమ్మెల్యేల సిఫార్సులు ఉన్నా.. డబ్బులు సమర్పించి బదిలీ ఆర్డర్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంలో సాంఘిక, బీసీ సంక్షేమ శాఖలు మొదటి వరుసలో ఉన్నాయి. ఈ శాఖల అధికారులకు - మిగతా చివరి పేజీలో

## బెట్టింగ్‌కు ఏడుగురు సూత్రదారులు అరెస్టు



- ఎచ్చెర్లలో నలుగురు, శ్రీకాకుళంలో ముగ్గురు అరెస్టు.. ఒకరు పరారీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ప్రధాన సూత్రదారులు నలుగుర్ని అదుపులోకి తీసుకున్నట్టు అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిందితులను మీడియా ముందుకు తీసుకువచ్చారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామం పరిధిలోని హనుమాన్ జంక్షన్ వద్ద బెంగళూరు, పంజాబ్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో జలుమూరు మండలం దరివాడ గ్రామానికి చెందిన దుంగ మన్మధరావు, ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామానికి చెందిన పాకాల కిశోర్, కర్రి రవితేజ, బైరి ఉపేంద్ర ఉన్నారని తెలిపారు. వీరి నుంచి ఆరు వివిధ కంపెనీలకు చెందిన సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెట్టింగ్‌కు డబ్బులు కట్టే వ్యక్తుల వివరాలతో కూడిన రెండు నోట్‌బుక్స్ స్వాధీనపరుచుకున్నట్టు తెలిపారు. వీరి నలుగురు సెల్‌ఫోన్ల ద్వారా స్నేహితులు, తెలిసినవారి నుంచి డబ్బులు సేకరించి బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించి అరెస్టు చేసినట్టు తెలిపారు.

### శ్రీకాకుళం రూరల్ పరిధిలో

ఒప్పంగి గ్రామంలో ఒక ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న సమాచారంతో రూరల్ ఎస్ఐ రాము సిబ్బందితో కలిసి రైడ్ చేసి ముగ్గుర్ని అదుపులోకి తీసుకోగా - మిగతా చివరి పేజీలో






- ❖అన్నీ కోల్పోయి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా
- ❖పిల్లలను చూసి ఆ ప్రయత్నం విరమించుకున్నా
- ❖పరిస్థితులకు ఎదురెళ్లి ఒంటరి పోరాటం
- ❖ఓ మహిళ అద్భుత జీవన విజయం

# ఆత్మస్థైర్యమే ఆమెను నిలబెట్టింది!

స్వాతి కొరపాటి

నా పేరు ప్రతిమ. మాది ఒంగోలు దగ్గర్లోని పేర్నిమిట్ట. చిన్నప్పటి నుంచీ బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలని అనుకునేదాన్ని. కోరుకున్నట్టే డిగ్రీ అయ్యాక హైదరాబాద్‌లో బ్యాంకు ఉద్యోగం వచ్చింది. హాయిగా చేసుకునేదాన్ని. కానీ ఉన్నట్టుండి ఓ రోజు ఇంటినుంచి ఫోను.. 'అర్జెంటుగా రా' అని. తీరా వెళ్తే.. 'మంచి కుటుంబం, పైగా బోలెడు ఆస్తి ఉంది. ఆ ఇంటికి ఆ అబ్బాయే పెద్ద..' అంటూ ఓ పెళ్లి సంబంధం గురించి చెప్పారు. నాకు అప్పుడే పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోయినా అంతా మంచి సంబంధం అంటున్నారు. పైగా జీవితానికి ఏ ఢోకా ఉండదని అనిపించి సరే అన్నాను. పెళ్లి తర్వాత ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదనే మాటా వాళ్లు ముందే చెప్పేశారు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేయడం ఇష్టంలేకపోయినా వదిలేసుకున్నా. అయితే వారం రోజుల్లో పెళ్లి అనగా నాన్న చనిపోయారు. పెళ్లి ఆగిపోతుందనుకున్నా కానీ.. దేవుడు నాకు కష్టాలు రాసిపెట్టాడేమో... అందుకే అనుకున్న ముహూర్తానికే మా పెళ్లి జరిగిపో - మిగతా చివరి పేజీలో



## పోలీసుల అదుపులో రైస్ పుల్లింగ్ ముఠా

- ✔ 10 మంది అరెస్టు.. రూ.5లక్షలు స్వాధీనం
- ✔ వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ కెవీ రమణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో రైస్‌పుల్లింగ్ ముఠాను గురువారం అదుపులోకి తీసుకున్నట్టు అదనపు ఎస్పీ కేవీ రమణ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలను - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# మేడిపండు చందం.. మన ఆర్థికం!

ఆర్థిక రంగంలో భారత్ శరవేగంగా దూసుకుపోతోందని.. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్టు ఐఎంఎఫ్ తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఇంత వరకు ఐదో స్థానంలో ఉన్న భారత్ నాలుగో స్థానంలో ఉన్న జపాన్‌ను అధిగమించి ఆ స్థానాన్ని ఆక్రమించడం ద్వారా ఒక మెట్టు పైకి ఎక్కినట్టు వార్తలు వచ్చాయి. దీన్ని తమ ప్రభుత్వ ఘనతగా మోదీ సర్కారు ప్రచారం చేసుకుంటోంది. అయితే స్థానాలు, గణాంకాలు మారుతున్నా దేశంలోని ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో ఎలాంటి సానుకూల మార్పులూ కనిపించటం లేదని ఆర్థిక నిపుణులు, మేధావులు ఎత్తిచూపుతున్నారు. దేశ సంపదంతా ఒక్క శాతం మేరకే ఉన్న అత్యంత సంపన్నవర్గం చేతిలో చిక్కుకుపోవడమే దీనికి కారణమంటున్నారు. ఫలితంగా దేశ ప్రజల తలసరి ఆదాయాలు చాలా తక్కువగా ఉన్నాయంటున్నారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ మేడిపండు చందంగా తయారైంది. ఈ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక వ్యవస్థ ఆశించినంతగా వృద్ధి సాధించలేదు. సర్కారు అనుసరిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలే కారణమని విశ్లేషిస్తున్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించటంలో కేంద్రం విఫలమైంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ఇతర నిత్యవసరాల ధరలు విపరీతంగా పెరిగి ప్రజల జేబుకు ఎప్పటికప్పుడు చిల్లు పడుతోంది. పరిస్థితులు ఇలా ఉంటే.. మనదేశం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్టు వార్తలు రావటం విస్మయం కలిగిస్తోంది. ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే దానికి తగినట్లు దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులు కూడా మారాలి. అదే అసలైన ఆర్థిక వృద్ధి. కానీ దేశంలో పరిస్థితులు దానికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. ప్రజల తలసరి ఆదాయాల్లో చెప్పుకోదగిన మార్పు లేదని గణాంకాలు చెప్తున్నాయి. ఈ విషయంలో చాలా చిన్న దేశాలకంటే మనం వెనుకబడి ఉన్నాం. దాంతో దేశం సంపన్నమవుతోంది తప్పితే ప్రజలు మాత్రం కాదని అర్థమవుతున్నది. ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 4.187 ట్రిలియన్ డాలర్లతో నాలుగో స్థానానికి చేరింది. 4.186 ట్రిలియన్ డాలర్లతో జపాన్ ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానానికి దిగజారింది. అదే సమయంలో ఈ రెండు దేశాల మధ్య తలసరి ఆదాయాలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. జపాన్ తలసరి ఆదాయం 33,900 డాలర్లు కాగా భారత ప్రజల తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. అంటే రెండు దేశాల మధ్య నక్కకీ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని స్పష్టమవుతోంది. అలాగే భారత ప్రజల ఆదాయంలో పెద్దగా పెరుగుదల లేదని అర్థమవుతుంది. ఆర్థిక వ్యవస్థ, గణాంకాలు ఎలా ఉన్నా.. భారత్‌లో ధనిక, పేద అసమానతలు ఆందోళనకరంగా ఉన్నాయి. 2022 నాటి ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం భారత దేశ మొత్తం సంపదలో 40 శాతం కంటే ఎక్కువ వాటా దేశ జనాభాలో ఒకే ఒక్క శాతంగా ఉన్న అత్యంత సంపన్నవర్గాల చేతుల్లోనే ఉండిపోతున్నది. అదే సమయంలో అట్టడుగు స్థానంలో ఉన్న 50 శాతం ప్రజల చేతిలో కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉండటం ఆందోళన కలిగించే విషయం. మొత్తంగా పది శాతం మంది మాత్రమే మన జాతీయ ఆదాయంలో 57 శాతానికి పైగా సంపాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థకు చెందిన ర్యాంకులతో దేశాభివృద్ధిని కొలవలేమని, సాధారణ పౌరుల ఆదాయాలు, జీవన ప్రమాణాలు మెరుగు పడటమే అసలైన అభివృద్ధికి సంకేతమని మేధావులు స్పష్టం చేస్తున్నారు. గణాంకాల గొప్పలతో ఉబ్బిపోకుండా ధనిక, పేద మధ్య ఉన్న ఈ లోతైన అసమానతల అంతరాన్ని రూపుమాపాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తెరగాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మన పక్కనే ఉన్న చైనా రెండో స్థానంలో ఉంది. 19.23 ట్రిలియన్ డాలర్లతో ఈ ఆసియా దేశం ప్రపంచంలో ఆధిపత్యం ప్రదర్శిస్తూ, తన పరిస్థితిని మెరుగుపరచుకుంటూ అగ్రస్థానంలో ఉన్న అమెరికాకే సవాలు విసురుతోంది. చైనా ఒకప్పుడు నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరినప్పుడు ఆ దేశ తలసరి ఆదాయం 3500 డాలర్లుగా ఉండేది. ప్రస్తుతం భారత్‌లో ఉన్న తలసరి ఆదాయం కంటే ఇది ఎక్కువే. ప్రస్తుతం చైనా తలసరి ఆదాయం 13 వేల డాలర్లుగా ఉంది. ఇది భారత తలసరి ఆదాయం కంటే దాదాపు ఐదు రెట్లు ఎక్కువ కావటం గమనార్హం. చైనాతో అన్ని రంగాల్లో పోటీ పడుతున్నామని చెప్పుకునే మోదీ సర్కారు.. ఈ విషయంలోనూ పోటీ పడితే దేశప్రజల ఆర్థిక స్థితిగతుల్లో గణనీయ మార్పు వస్తుంది.

## సమరశీల పోరాటాలు నిర్వహించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్మిక హక్కులు కోసం, సమస్యలు పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరిశాం గ్రామం వద్ద గల శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2 పరిశ్రమ వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఐక్యత-పోరాటం" నినాదంతో 1970 మే 30న సిఐటియు ఆవిర్భవించిందన్నారు. మొదటిలో చిన్న యూనియన్‌గా ఉన్నా సరే 1970వ దశకంలో రైల్వే కార్మికులను ఐక్యం చేసి 20రోజుల సమ్మెతో కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన దశ నుండి నేడు కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసి ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేక పోరాటంలో అగ్రభాగాన నిలుస్తుందన్నారు. సిఐటియు కార్మికుల హక్కులు కోసం, సమస్యలు పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించిందని, విశాల కార్మికవర్గ ఐక్యత కోసం సిఐటియు కృషి చేస్తోందని తెలిపారు. సిఐటియు ఏర్పడినప్పటి నుండి కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై రాజీలేని పోరాటం చేసిందని గుర్తు చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కోరుతూ జూలై 9న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపికి పాలకులకు ప్రజలు ప్రయోజనాలు కంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్‌ల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం ద్వారా దోపిడీ, పీడన లేని సమాజం సిఐటియు లక్ష్యమన్నారు. శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో అక్రమంగా సస్పెండ్ చేసిన 7గురు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మిక శాఖ సంయుక్త కమీషనర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 30సంవత్సరాలు సర్వీసు పూర్తయిందని కార్మికులకు యాజమాన్యం చేస్తున్న బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించి వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్.కూర్మారావు, వెంపడాపు లక్ష్మణరావు, ఎమ్.రమణ, దన్నాన శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.





మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడలోని తాడేపల్లిలో ఉన్న క్యాంపు కార్యాలయంలో వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఇతర సహచర సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా క్రమశిక్షణ కమిటీకి సంబంధించిన విధి విధానాలు, నియమాలను రూపొందించారు. అదే విధంగా అధికార కూటమి ప్రభుత్వం చేపడుతన్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు.

\- సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## ఆధ్యాత్మిక సేవలో గొండు శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)





ఆధ్యాత్మిక భావనతో ప్రతీ ఒక్కరూ ఉండాలని, భగవంతుని సేవలోనే ఆనందముందని శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ అన్నారు. కడప మహానాడు పండుగతో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, యావత్ ప్రపంచమే సంతోషించిందని, దానికి ముఖ్య కారణం టీడీపీ వ్యవస్థాపకులు, తన నవరస నటనతో ప్రపంచంలో అభిమానులను సొంతం చేసుకొని, రాజకీయాలలో నూతనోత్సవానికి నాంది పలికిన, అప్పటి ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరనీయుడు ఎన్టీఆర్ ఆలోచనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలతో ముందుకెళుతున్నారన్నారు. లోకమంతా సుభీక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటూ సుఖ సంతోషాలతో ఉండాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ రోజు కడపలో ప్రముఖ వెంకటేశ్వర దేవాలయం, దుర్గమ్మతల్లి దేవాలయాలతో పాటు చర్చిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

## 4వ రోజు విజయవతంగా ఎక్స్‌పో-2025

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఫ్రాన్స్‌లో నిర్వహిస్తున్న ఎక్స్‌పో-2025లో 4వరోజు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన శివశ్రీ నృత్యకళానికేతన్ దర్శకుడు శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్యబృందం నృత్య ప్రదర్శన వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అంతర్జాతీయ సమగ్రత వేడుకలో భాగంగా ఈ బృందం మే 28న ఫ్రాన్స్ దేశం పాపప్ వేదిక మీద ఫ్యూషన్ నృత్యాన్ని ప్రదర్శించి నిర్వాహకులను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో రామ కౌండిన్య, అన్నా నేహా థామస్, గాయత్రి వర్షిత, నేహా పట్నాయక్, చాందిని, లలిత తదితరులు పాల్గొన్నారు. ఇటువంటి మంచి అవకాశం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీఈడిపి వారికి రఘుపాత్రుని శ్రీకాంత్, శిష్యబృందం కృతజ్ఞతలు తెలుపుకున్నారు.



## స్నేహ హస్తం అందించిన చిన్ననాటి మిత్రులు

(సత్యంన్యూస్, టెక్కలి)

ఇటీవల కోటబొమ్మాళి మండలం విశ్వనాధపురం పంచాయతీ సింహాద్రిపురం గ్రామంలో అకాల మరణం చెందిన సనపల చక్రధర్ కుటుంబానికి తామున్నామంటూ తోటి విద్యార్థులు ధైర్యం చెప్పి ఆదుకున్నారు. 1999-2000 విద్యా సంవత్సరం జర్జంగి ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ తమ మిత్రుని మరణ వార్త విని, ఆయన పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం రూ.80 వేలు చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. చక్రధర్ మిత్రులు చేసిన సహాయం కు సింహాద్రిపురం గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో ఆయన చిన్ననాటి మిత్రులు గొండు నారాయణరావు, గుంట సోమేశ్వరరావు, కూన కోటేశ్వరరావు, కిల్లి అరవింద్, తిర్లంగి అప్పలనాయుడు పాల్గొన్నారు.






తాడిని (తాటిని) తన్నేవాడుంటే వాడిని తలదన్నే వాడు ఉంటాడు అనే సూత్రం మీద ఆధారపడి ఉన్న ఎత్తులు, ఎత్తుకుపైఎత్తుల కథ ఈ ఛాలెంజ్ సినిమా కథ. అప్పటికే వీర పాపులరయిన యండమూరి వీరేంద్రనాథ్ గారి డబ్బు టుది పవరాఫ్ డబ్బు నవల ఆధారంగా తీయబడిన ఈ సినిమా సూపర్ డూపర్ హిట్టయింది. 40ఏళ్ళ తర్వాత కూడా సినిమా పాతబడలేదు. ఇప్పుడు తీసిన సమకాలీన సినిమా లాగానే ఉంటుంది. యండమూరి గారు సృష్టించిన పాత్రలకు ఇంకా ఎక్కువ నగిషీ పెట్టారు స్క్రీన్‌ప్లే రైటర్ సాయినాథ్ గారు. సూపర్‌ఫాస్ట్ రైలు లాగా ఉరకటానికి కోదండరామిరెడ్డి గారి దర్శకత్వం ఎంత కారణమో, అంతే ఘనత సాయినాథ్ గారి స్క్రీన్‌ప్లేది కూడా. ఆ తర్వాత సత్యమూర్తి గారి డైలాగ్స్. ఏకే 47 నుండి వచ్చే తూటాల్లాగా దూసుకు వస్తాయి. సినిమాలోని ఎత్తుకుపైఎత్తులకు ధీటైన వ్యక్తీకరణ డైలాగులు. ఆ రెండింటినీ సమన్వయం చేయడం కష్టమే. అయినా సత్యమూర్తిగారు చాలా పదునైన డైలాగులను వ్రాసి సక్సెస్ అయ్యారు.

# ఎత్తుకు పై ఎత్తుల కథ!

తర్వాత పాటలు. వాటిని వ్రాసిన వేటూరి వారిని, డాన్సులను కంపోజ్ చేసిన తారను, సంగీతాన్ని స్వరపరచిన ఇళయరాజాని అభినందించాలి. బ్రహ్మాండమయిన మ్యూజిక్ ఇళయరాజా గారిది. నాకయితే వీర నచ్చింది చిరంజీవి, సిల్క్‌స్మిత పాట, డాన్స్. ఖైదీ సినిమాలో రగులుతుంది మొగలి పొదే గుర్తుకొస్తుంది. ఆ పాటలో చిరంజీవి గుర్రం మీద ఎంట్రీని కోదండరామిరెడ్డి అద్భుతంగా చిత్రీకరించారు. మనసే మైకం పాట.


మిగిలిన అన్ని డ్యూయెట్లు చిరంజీవి, విజయశాంతి, సుహాసిని అదరగొట్టేసారు. ఇందువదన కుందరదన మందగమన పాటలో ఐలవ్యూ హారికా కుర్రాళ్ళు బాగానే పాడేవాళ్ళు. కుందరదన అంటే ఏంటో!? సాయంకాలం సాగరతీరం, భామా ఈ తిప్పలు తప్పవు ఎప్పటికయినా, ఓం శాంతి ఓం శాంతి డ్యూయెట్లు సినిమా ఘన విజయానికి ప్రధాన కారణాలలో ముఖ్యమయినవి.

చిరంజీవి నటనతో ధీటుగా రావు గోపాలరావు, విజయశాంతి, సుహాసినిలు పోటీపడ్డారు. సుహాసిని, విజయశాంతి పాత్రలను చాలా గొప్పగా తీర్చిదిద్దారు. తర్వాత చెప్పుకోవలసింది గొల్లపూడి మారుతీరావు, సిల్క్‌స్మితల జంట. పనిగండం పేరుతో ఏ పని చేయకుండా, ఒకవేళ చేసినా సున్నప్పిడత పనులు చేసే బతుకు. ప్రతి డైలాగుకు ఆఫ్ ఇండియా అనే ట్యాగ్‌లైన్ తగిలిస్తూ మాట్లాడే గొల్లపూడి డైలాగులు, డైలాగ్స్ డెలివరీ సినిమాకు హైలైటే. డాన్సులకే పరిమితమయ్యే సిల్క్‌స్మితకు సినిమా అంతా ఉండే మంచిపాత్ర లభించింది. చక్కగా పోషించింది. ఇతర ప్రధాన పాత్రల్లో సాయికుమార్, రాజేంద్రప్రసాద్, ప్రభృతులు నటించారు.

సాధారణంగా యండమూరి నవలలు చదరంగం ఆట లాగా ఉంటాయి. యక్ష ప్రశ్నలు, క్విజ్ పోటీల్లాగా ఉంటాయి. ఈ సినిమాలో అలాంటి డైలాగులు పుష్కలం. ఆవేశంలో కూతుర్నే పందెం కాసిన తండ్రితో మహాభారతంలో ధర్మరాజు భార్యను ఎలా పందెం కాసాడో అర్థం అవుతుందనే కూతురి డైలాగ్ ప్రేక్షకులకు గుర్తు ఉండే ఉంటుంది. వ్యాపారంలో కట్టుకున్న దానిని కూడా నమ్మకూడదనే వ్యాపార సూక్తి. న్యాయబద్ధత × చట్టబద్ధత డిబేట్. ఆర్థిక, సామాజిక, రాజకీయ నేరాలు చేయటం అన్యాయం. ప్రాసిక్యూషన్ వైఫల్య సహాయంతో శిక్ష తప్పించుకోవటం చట్టబద్ధత. ఇదే మన దేశ సమకాలీన సంస్కృతి కదా!

14 సెంటర్లలో వంద రోజులు ఆడటమే కాదు, కనక వర్షం కూరిపించింది. సుందర విశాఖ పట్టణంలో తీస్తే సినిమాలు సక్సెస్ కావాల్సిందే. నిర్మాత కెయస్.రామారావు, దర్శకుడు కోదండ రామిరెడ్డి, చిరంజీవి, యండమూరి కాంబినేషన్ సూపర్ కాంబినేషన్ అయింది ఈ సినిమాతో. ఈతరంలో కూడా ఈ సినిమా చూడని వారు ఎవరూ ఉండరేమో! ఎవరయినా ఒకరూ అరా ఉంటే అర్జెంటుగా చూసేయవచ్చు. యూట్యూబులో ఉంది. తలచుకుంటే ఛాలెంజుగా తీసుకుని యువతరం ఏదయినా సాధించగలదనే సందేశాన్ని ఇస్తుంది సినిమా.

\- సుబ్రమణ్యం దోగిపర్తి




# దిశా పటానీ స్టన్నింగ్ బీచ్ లుక్

లోఫర్ బ్యూటీ దిశా పటానీ, ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు, సౌత్ లోను భారీ చిత్రాలలో నటించే అవకాశాల్ని అందుకుంటున్న సంగతి తెలిసిందే. కెరీర్ లో సరైన విజయాలు లేకపోయినా ఈ బ్యూటీ యూత్ లో నిరంతరం ఫాలోయింగ్ ని ఆస్వాధిస్తోంది. సోషల్ మీడియాల్లో ఎప్పటికప్పుడు వేడెక్కించే ఫోటోషూట్లతో లక్షలాది ఫ్యాన్స్ కి ట్రీటిస్తోంది. దిశా పటానీ బీచ్ వెకేషన్స్ నుంచి ఫోటోషూట్లు ప్రత్యేకం. తాజాగా దిశా పటానీ ఇన్‌స్టా ఫోటో చూస్తుంటే, మొనాకో గ్రాండ్ ప్రిక్స్‌లో వీక్షణను ఆస్వాధిస్తోంది ఈ భామ. దీనికి అందమైన క్యాప్షన్ ఇచ్చింది. ఇది ఒక కమర్షియల్ ప్రకటన. పాపులర్ ఖతార్ ఎయిర్ వేస్ కి సంబంధించిన ప్రచారం. లేటెస్ట్ ఫోటోగ్రాఫ్స్ లో లూజ్ డఫెల్ జీన్స్ ధరించిన దిశా బ్యాక్ లెస్ ఫోజులతో ప్రత్యేకంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దిశా స్టన్నర్ అని మరోసారి నిరూపించింది. దిశా ఎంపిక చేసుకున్న ఫ్యాంటుకు తగ్గట్టే డిజైనర్ టాప్ వీలున్నంత పొదుపుగా కనిపించింది. ఇక కళ్లకు గ్లాసెస్ ధరించి స్టైలిష్ గా ఫోజులిచ్చింది. ప్రస్తుతం దిశా ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. కల్కి సీక్వెల్ తర్వాత దిశా పటానీ సూర్య కంగువలో నటించింది. కానీ ఈ చిత్రం నిరాశపరిచింది. తదుపరి ఏక్తాకపూర్ తో సినిమా చేయాల్సి ఉన్నా దాని గురించిన వివరాలేవీ బయటకు రాలేదు.

\- తుపాకి.కామ్ సౌజన్యంతో...



## పారిశుధ్యాన్ని మెరుగుపరచండి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలంలోని చినరావుపల్లి గ్రామంలో వీధులన్నీ బురదమయమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాకపోకలు సాగించాలంటేనే ఇబ్బందులు ఎదుర్కొన్నాల్సి వస్తోందటున్నారు. ప్రస్తుత సీజన్‌లో కరోనా డేంజరస్ బెల్స్ దేశంలో మోగుతున్నాయని, అధికారులు నాయకులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారన్నారు. కానీ క్షేత్రస్థాయి అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిలబడిపోతుందంటున్నారు. దీంతోపాటు కుళాయిలు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



## జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్ వద్ద యోగా శిబిరం నిర్వహించారు. ఆయుష్ శాఖతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 300 మంది క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు. కోచ్‌లు ఎల్.రాజశేఖర్, డి.లక్ష్మణరావు, బి.గోవిందరావు, పి.ఎస్. మనికుమార్, కె.హరికృష్ణ, ఎల్.అనిల్‌కుమార్, ఎం.ఉమామహేశ్వరరావు, ఎస్.సింహాచలం, జి.అర్జున్‌రెడ్డి, బి.అప్పన్న, పి.చంద్రశేఖర్, జి.శ్రీనివాస్‌రావు తదితరులున్నారు. డీఎస్ఏ సిబ్బంది ఉపేంద్ర, సీఈటీఎస్ఆర్ సీఈఓ బి.వి. ప్రసాద్‌రావు, ఆయుష్ విభాగం ఇన్‌చార్జ్ డా.జగదీష్ ఆధ్వర్యంలో యోగా మాస్టర్లు మురళీకృష్ణ, శేఖర్, మురళీధర్ యోగా సాధనకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డా. కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ, యోగ శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైందని, క్రీడాకారులలో దృఢమైన ఏకాగ్రతను పెంచేందుకు యోగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.



## ఇలిసిపురంలో కొత్త కాలువల నిర్మాణం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణ పరిధిలో గల ఇలిసిపురం జంక్షన్ వద్ద కాలువలపై పలకలు సరిగా లేక ఎన్నో రోజులుగా నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో చిన్నచిన్న ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులకు, పాలకులకు ఈ విషయమై ఎన్నోసార్లు స్థానికులు, వాహన చోదకులు విన్నవించినప్పటికీ ఫలితం మాత్రం కనిపించలేదు. ఈనేపథ్యంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన కాలువలు, దానిపై పలకలు సరిగ్గా అమర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతోపాటు టీడీపీ నాయకులు ఇప్పిలి తిరుమలరావు, దేవల్ల విస్సులకు ఈ పనులు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. దీంతో కాలువలను కొత్తగా నిర్మించి వాటిపై పలకలు సరిగా అమర్చేలా వారు తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా స్థానికులు, వాహన చోదకులు, ఎమ్మెల్యే, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో నూతన రైతుబజార్‌ను మంజూరు చేసినందుకుగాను రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విజయవాడలోని అచ్చెన్న స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ రైతుబజార్ రాక వలన రైతులకు, వినియోగదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉందన్నారు.

– సత్యంన్యూస్, పాతపట్నం



ఇటీవల మృతి చెందిన వైకాపా నేత కళ్యాణి జ్యోతిప్రసాద్ కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం పరామర్శించారు. ఈమేరకు రెల్లివీధిలో గల ఆయన నివాసానికి జ్యోతిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సంక్షేమానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



కడపలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి వారి ఆలయాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, ఆమదాలవలస



కంచిలి మండలంలోని చిల్లపుట్టుగ గ్రామంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం ఇప్పించాలని ఏపీ సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## చరిత్రలో శిలాక్షరం ఈ మహానాడు సంబరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువ నాయకులు నారా లోకేశ్ సారథ్యంలో మహానాడు విజయవంతం అవడం హర్షణీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయిన విధంగా కడప గడ్డపై ఈ మహానాడు అత్యంత వైభవంగా లక్షలాదిమంది ప్రజల మధ్యన తెలుగుదేశం జెండా రెప రెపలాడుతూ ఇంతటి విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడం ఆనందించదగ్గ విషయమన్నారు. దీని వెనుక నారా లోకేశ్ కృషి ఎంతో ఉందన్నారు. చరిత్రలో శిలాక్షరాలతో రాసుకునే విధంగా మహానాడు నిర్వహించడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. నభూతో నభవిష్యత్ అన్న రీతిలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యకర్తలు, నాయకులలో నూతనోత్సాహం వెల్లువెత్తిందన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా రానున్న కాలంలో చెప్పుకునే విధంగా.. దేవుని గడప కడపలో జరిగిన ఈ మహానాడుతో లోకేశ్ నాయకత్వ లక్షణాలు, సభను నడిపించే సమర్థనీయ ధోరణి అన్నవి వెల్లడయ్యాయన్నారు. అందుకు ఆయనకు తాను మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నామన్నారు. రానున్న కాలంలో భవిష్యత్తు నాయకుడిగా లోకేశ్ పార్టీకి మరింతగా దిశా నిర్దేశం చేసేందుకు, తండ్రి చంద్రబాబునాయుడు అడుగుజాడల్లో నడిచేందుకు ఈ మహానాడు అందించిన స్ఫూర్తి ఆయన్ను మరింతగా ఉన్నత నాయకుడిగా ఎదిగేందుకు దోహద పడుతుందని అభిప్రాయపడ్డారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అశేష జనవాహిని నడుమ జరిగిన ఈ కార్యక్రమం మహోజ్వల స్ఫూర్తిని రగిలించిందననడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించిందని చెప్పేందుకు మహానాడుకు వచ్చిన ఆదరణే కారణమన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవం చాటడంలో తెలుగు దేశంపార్టీ నిరంతరం ముందుంటుందందన్నారు. లోకేశ్ ప్రతిపాదించిన ఆరు శాసనాలే అందుకు తార్కాణం నిలుస్తాయని పేర్కొంటూ నిర్వహణ బాధ్యతలలో విజయంతమైన లోకేశ్‌కు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నానని అచ్చెన్న పేర్కొన్నారు. మహానాడు కార్యక్రమానికి హాజరైన విజయవంతం చేసిన కార్యకర్తలకు నాయకులకు అభినందనలు తెలిపారు.



## అన్ని దానాల్లో అన్నదానం మిన్న

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నిధానాల్లో "అన్నదానం" మిన్న అని సీనియర్ కెమెరామాన్ బైరి శ్యామ్ సుందర్ శుక్రవారం అన్నారు. స్థానిక బెహరా మనోవికాస కేంద్రంలో సీనియర్ కెమెరామాన్ బైరి శ్యామ్‌సుందర్ తాత దీర్ఘాసి పెంటయ్య వర్ధంతి సందర్భంగా అల్పాహార వితరణ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ అన్నం పరబ్రమ్మ స్వరూపమని, ఇక్కడ పిల్లలు మనోవికాసంతో బాధపడుతున్న తీరుబాధాకరమన్నారు. బెహరా మనోవికాస కేంద్ర నిర్వాహకురాలు శ్యామల చేస్తున్న సేవలు వర్ణించలేనిదని, ప్రతీనెలా నగరంలో అన్నవితరణ చేస్తామన్నారు. ప్రజాసేవకు వరజ్యోతి ఫౌండేషన్ ద్వారా మా వంతు సహాయ, సహకారాలందిస్తామని ఇందులో భాగంగా శుక్రవారం బెహరా మనోవికాస కేంద్రంలో నా తల్లి వరజ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు బైరి జ్యోతితో కలసి అల్పాహారమందించామని వరజ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ కెమెరామాన్ బైరి.శ్యామ్ సుందర్ తెలిపారు. కార్యక్రమంలో బైరి శ్యామ్ సుందర్ కుటుంబ సభ్యులు, సేవకులు ఉర్లం. శివతేజ పట్నాయక్, బెహరా మనోవికాస కేంద్ర నిర్వాహకులు, పిల్లలు పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సత్యవతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పెదపాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల (బాలికలు) కళాశాల ప్రిన్సిపాల్‌గా సరెళ్ల సత్యవతి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం తామరాపల్లి బాలికల గురుకుల కళాశాలలో తెలుగు జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సత్యవతికి రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా పదోన్నతి లభించింది. కాగా పెద్దపాడు ఎఫ్.ఏ.సీ. ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న బి.మాధవీలత నుంచి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1996లో సర్వీసులో చేరిన సత్యవతి దుప్పలవలస, తామరాపల్లి, ఎచ్చెర్ల, నందిగాం గురుకుల పాఠశాలల్లో సేవలందించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ జి. గ్రేసీ, సెక్రటరీ ప్రసన్న వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రిన్సిపాల్స్ కృష్ణతార, రంగమణి, మాధవీలత, సిబ్బంది సీమల పుష్పవేణి, రమణయ్య, ప్రమీల, బోని భవాని, సరిత, ఝాన్సీ, అరుణకుమారి, పూర్ణ తదితరులు సత్యవతిని అభినందించారు.



కొత్తూరు మండల కేంద్రంలో ఎస్సై చింతాడ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెండింగ్ చలానాలు, వాహనాల పత్రాలు తనిఖీ చేశారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. – సత్యంన్యూస్ కొత్తూరు.

## చరిత్రకారులు రైట్ సోదరులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చరిత్రకారులు రైట్ సోదరులని, ట్రావెల్ అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్షులు నటుకుల మోహన్ శుక్రవారం అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యాలయంలో రైట్ సోదరులలో ఒకరైన విల్బర్ రైట్ వర్ధంతిని ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విల్బర్ రైట్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలిఘటించి, సభ్యులు బరాటం శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రైట్ సోదరుల ఆలోచనకు జోహార్ అని, ప్రస్తుతం గగన విహారం చేస్తున్న ఎన్నో విమానాలు, హెలికాప్టర్లకు ఆద్యులు రైట్ సోదరులన్నారు. వీరు చేసిన సాహస కార్యాలు, పరిశోధనల కారణంగానే దూరతీరాలు దగ్గరవుతున్నాయని, 115 సంవత్సరాల క్రితం రైట్ సోదరులు కనిపెట్టిన ఎగిరే యంత్రానికి రెక్కలొచ్చాయని, విల్బర్ రైట్ (1867 ఏప్రిల్ 16 – మే 30, 1912) ఒక అమెరికన్ విమాన యజమాని, రైట్ సోదరులలో ఒకరు, తన అన్నయ్య ఓర్విల్ రైట్‌తో కలిసి మొదటి విజయవంతమైన శక్తితో నడిచే విమానాన్ని నిర్మించి, ఎగరడంలో గణనీయమైన పాత్ర పోషించారన్నారు. అటువంటి చరిత్రకారుల జీవితాలను ఆదర్శవంతంగా తీసుకొని వర్ధంతిని జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ సభ్యులు ఉరిటి శ్రీనివాసరావు, కాపవరపు సీజు, సథరన్ ట్రావెల్స్ సభ్యులు, ఎస్ఎస్ జ్యుయలర్ శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, నూతన ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ, జోగిరాజు, ఇజ్జాడ అనిల్ సాయిలు పాల్గొన్నారు.



## 'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జూన్ 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలను మోసం చేసి, ఆశలపై నీళ్లు చల్లింది. ఆ బాధలను ప్రజల తరపున వెల్లడించేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు జూన్ 4న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 'వెన్నుపోటు దినం' నిర్వహించాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు" అని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీలుగా వెళ్లి కలెక్టర్లకు, నియోజకవర్గ స్థాయి అధికారులకు జూన్ 4న మెమోరాండం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు."ఇది ప్రజలతో ఉన్న మమకారాన్ని చాటే సమయం. అన్ని వర్గాల సమస్యలకు అండగా నిలవాల్సిన సందర్భం వచ్చిందన్నారు. అందువల్ల ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం జరిపి, ప్రజలను భాగస్వామ్యం చేయాలి. అంతేగాక, రెండు రోజుల్లో అన్ని మండల కేంద్రాల్లో పోస్టర్ రిలీజ్ కార్యక్రమాలు చేపట్టాలి" అని సూచించారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి బలంగా తెలియజేయాలని ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# పోలీసుల అదుపులో రైస్ పుల్లింగ్ ముఠా

మొదటిపేజీ తరువాయి

వెల్లడించి మీడియా ముందుకు నిందితులను తీసుకువచ్చారు. రైస్ పుల్లింగ్ అక్షయ పాత్ర పేరుతో వెన్నెలవలస గ్రామం నుంచి రిజర్వాయర్ కు వెళ్లే మార్గంలో పాడుబడిన బంగ్లా వద్ద క్రయ విక్రయాలు జరుపుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సరుబుజ్జిలి ఎస్ఐ హైమావతి సిబ్బందితో కలిసి 10 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అరెస్టయిన వారిలో రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన పూని భద్రయ్య, పూని రాజు, నరసన్నపేట మండలం కిల్లాంకు చెందిన నక్కిన రఘునాధరావు, ఎల్.ఎన్.పేట మండలం బొర్రం పేటకు చెందిన కుప్పిలి భాస్కరరావు, విశాఖ పట్నం మధురవాడకు చెందిన పచ్చితల రవి శంకర్, రుద్రరాజు వెంకట రంగరాజు, పెద గంట్యాడ సీతానగరానికి చెందిన రౌతు కనక రాజు, తిరుపతి జిల్లా చిన్నగొట్టికల్లు మండలం చట్టేవారిపాలెంకు చెందిన గట్టిక్కల మురళీకృష్ణ, హైదరాబాద్‌లోని బహుదూర్పురా సమీపంలోని రామనర్స్‌పూర్‌కు చెందిన గరికి శ్రీను, కాకినాడ జిల్లా అగ్రహారం పిఠాపురానికి చెందిన కొండశ్రీ వెంకటనాగ సత్యనారాయణ ఉన్నట్లు వివరించారు. విశాఖపట్నానికి చెందిన రవిశంకర్, అతని స్నేహితులు రుద్రరాజు వెంకట రంగరాజు, కనక రాజు, రఘునాధరావు, మురళీ కృష్ణ, గరిక శ్రీను, కొండ వెంకట నాగ సత్యనారాయణ విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ నష్టపోయారని, సులువుగా డబ్బులు సంపాదించాలనే యావతో రైస్‌పుల్లింగ్‌లో అనుభవం ఉన్న రవి శంకర్ మధ్యవర్తిత్వంతో పూని భద్రయ్య వద్ద పురాతన వస్తువు రైస్ పుల్లింగ్ అక్షయ పాత్రను రూ.25 లక్షలకు బేరం కుదుర్చుకున్నట్టు తెలిసింది. అందులో రూ.5లక్షలు అడ్వాన్స్ ఇస్తుండగా, అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. నిందితులను పట్టుకొని కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఆమదాలవలస, సరుబుజ్జిలి ఎస్.హైమవతి, సిబ్బంది జనార్ధనరావు, తిరుపతిరావు, గణపతిరావు, సత్యనారాయణ, లక్ష్మణరావు, నర్సింగరావు, సంతోష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, అవతారం, పి.సత్యనారాయణ, ఎఐ సందీప్, రమణ, కృష్ణ, కానిస్టేబుల్ గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది తిరగకుండానే కూటమి పాలన విఫలం

- వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి
- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

ఏడాది తిరగకుండానే కూటమి ప్రభుత్వం పాలనలో విఫలమైందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ నేతలతో సమావేశమై క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. జూన్ 4న టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతోందని, ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని, ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు జూన్ 4 వెన్నుపోటు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైకాపా శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ధర్మాన పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, జిల్లా వైకాపా ఉపాధ్యక్షురాలు ఎంవీ పద్మావతి, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, మాజీ ఎంపీపీ చిట్టి జనార్ధన, పొన్నాడ రుషి, బుక్కూరు ఉమా మహేశ్వరరావు, తంగి అప్పన్న, కోణార్క్ శ్రీను, మూకళ్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

# సొంత అజెండాతో బదిలీల దందా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ మార్గదర్శకాలు పట్టవు. ఉద్యోగ సంఘాల ద్వారా కలెక్షన్లు చేయించి, ఆ ప్రకారం బదిలీల జాబితాను తయారు చేయించేశారు. దీని కోసం ఆయా శాఖల అధికారులు రహస్య సమావేశాలు నిర్వహించారు. ఈ శాఖల్లో మార్గదర్శకాలను పక్కన పెట్టి బదిలీలు చేస్తున్నట్టు పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖలో డీడీ విశ్వమోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్ జగన్మోహనరావు తమకు కావలసినవారితో బదిలీల జాబితా రూపొందించి కలెక్టర్‌కు పంపించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీరో సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకొని బదిలీ చేస్తున్నట్టు ఆ శాఖ అధికారులు చెబుతున్నా టెక్కలి, రణస్థలం, ఆమదాలవలస, బారువ వసతిగృహాల అధికారులను మాత్రం మినహాయించారని తెలిసింది. ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించకుండానే బదిలీ జాబితా తయారు చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులన్న సాకుతో కొందరిని బదిలీల నుంచి మినహాయించారు. డబ్బులిచ్చిన మరికొందరిని వారి సొంత ఇలాఖాల్లోని వసతిగృహాల్లో కొనసాగేలా కౌన్సెలింగ్ లేకుండానే బదిలీ జాబితాలో చేర్చారు. అదే సమయంలో దీన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యోగులను గిరిజన ప్రాంతాలకు బదిలీ చేస్తూ జాబితాలో చేర్చారని తెలిసింది. కూటమి నాయకులు, ఉన్నతాధికారులు చెప్పినా పట్టించుకోనని అంటున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి తమ శాఖ జిల్లా కార్యాలయంలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన వారిని మాత్రం బదిలీ చేయడం లేదంటున్నారు. ఇటీవల తనపై ఫిర్యాదు చేసిన వారిపై బదిలీ వేటు వేసేందుకు డీడీ విశ్వమోహన్‌రెడ్డి సిద్ధపడినట్లు తెలిసింది. డీడీపై కలెక్టరేట్ అధికారులు విచారణ జరిపి నివేదిక ఇచ్చినా కలెక్టర్ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

### డీఆర్వోకు అప్పగించినా ఆమె చెప్పినట్లే..

బీసీ సంక్షేమ శాఖ అధికారి అనురాధపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆ శాఖకు చెందిన బదిలీల కౌన్సెలింగ్ బాధ్యతను డీఆర్వోకు కలెక్టర్ అప్పగించారు. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులుగా చెలామణీ అవుతున్న వైకుంఠరావు, రాజారావు, గోపాలరావులను రంగంలోకి దించి గురువారం వార్డెన్లతో ఎన్జీవో హోంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే దీనికి పలువురు దూరంగా ఉన్నారు. వచ్చినవారు కూడా ఎవరు.. ఎక్కడికి బదిలీ కోరుకున్నారన్నది చర్చించి వెళ్లిపోయారు. అయితే డబ్బులు ఇచ్చినవారికి పోస్టింగ్ ఇస్తున్నందున ఆ స్థానాల్లో వేరెవరూ బదిలీ కోరుకోవద్దని వార్డెన్లకు డీబీసీడబ్ల్యూవో అనురాధ అల్టిమేటం ఇచ్చినట్టు తెలిసింది. ఈ వ్యవహారమంతా వార్డెన్ల సంఘం నాయకులు కనుసన్నల్లోనే జరుగుతోందని ఆ శాఖలోనే ప్రచారం ఉంది. డీఆర్వోకు ఇచ్చిన బదిలీల కౌన్సెలింగ్ జాబితాను అనురాధే తయారు చేయించారని ప్రచారం జరుగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల ప్రకారమే జాబితా రూపొందించామని ఉన్నతాధికారులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కారుణ్య నియామకాల్లో డీబీసీడబ్ల్యూవో అనురాధ అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు రావడంతో ఆమెపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆమె బదిలీల కౌన్సెలింగ్‌కు దూరంగా ఉంటారని అందరూ సంబరపడ్డారు. కానీ ఆమె ఉన్నతాధికారులను మేనేజ్ చేసి డీఆర్వోతో పాటు తాను కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొంటానని ఉద్యోగులందరికీ సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దీంతో కోరుకున్న చోటుకు బదిలీ కావల్సినవారు డబ్బులు సమర్పించుకొని ఆర్డర్లు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది.

### మాజీ ఉద్యోగ నేతల పైరవీలు

వైద్యఆరోగ్య శాఖలో ఉద్యోగ సంఘాల మాజీ, ప్రస్తుత నాయకులు రంగంలోకి దిగారు. గతంలో ఉద్యోగ సంఘాల్లో కీలక పదవులు చేసి రిటైరైన వారు కూడా డిపార్ట్‌మెంటులో తమ ప్రాబల్యం తగ్గలేదని నిరూపించుకొనే పనిలో పడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో అనుకూలమైన బదిలీలు కోరుకుంటున్న ఉద్యోగులు వారి చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదనుగా మరికొందరు డబ్బులు దండుకొని వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై ఉద్యోగ సంఘాల పేరుతో ఒత్తిడి తెచ్చి బదిలీల కోసం సిఫార్సులు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో లెటర్‌హెడ్స్ ఇచ్చి బదిలీల నుంచి మినహాయింపు పొందడానికి కూడా కొందరు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శినంటూ టీడీపీ హయాంలో జెడ్పీ చైర్‌పర్సన్ వద్ద సీసీగా చేసిన సమయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సంతోష్ ఉద్యోగుల బదిలీల పేరుతో హడావుడి చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర కార్యదర్శినంటూ లెటర్ హెడ్ ముద్రించుకుని, దాన్ని అధికారులకు చూపించి బదిలీల నుంచి పలువురికి మినహాయింపు ఇవ్వాలంటూ ఆయా శాఖల జిల్లా అధికారులకు సిఫార్సు చేసినట్టు తెలిసింది.

# బెట్టింగ్‌కు ఏడుగురు సూత్రదారులు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కరు పరారీలో ఉన్నట్టు ఏఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. అరెస్టు అయిన వారిలో ఒప్పంగికి చెందిన మంత్రి ధనుంజయరావు, విశాఖపట్నం పోతిన మల్లయ్య పాలెం సంజీవిని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న దయాల శ్రీనివాసరావు, దయాల సంగీతను అరెస్టు చేసినట్టు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన రొక్కం వెంకట స్వాతినాయుడు పరారీలో ఉన్నాట్టు తెలిపారు. ధనుంజయరావు, దయాల శ్రీనివాసరావు, ఆయన భార్య సంగీత లక్ష్మి, రొక్కం స్వాతి నాయుడు క్రికెట్ బెట్టింగ్ లావాదేవీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరి నుంచి 5 మొబైల్ ఫోన్లను, బెట్టింగ్ వివరాలు నమోదు చేసిన పుస్తకంతో పాటు రూ.8,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం టౌన్ డిఎస్పి సిహెచ్ వివేకానంద, ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్, ఏఎస్ఐ కె.రమేష్ దేవ్, శ్రీకాకుళం రూరల్ ఎస్సై రాము, శ్రీనివాసరావు, రామారావు, నారాయణరావు, పోలీస్ కానిస్టేబుల్ కె.దివాకర్, కె.శ్రీనివాసరావు, సిహెచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపించినవారిని ఎస్పీ అభినందించారు.

# ఆత్మస్థైర్యమే ఆమెను నిలబెట్టింది!

(మొదటిపేజీ తరువాయి)

యింది. ఆ తర్వాత ఆరు నెలలు ఎలా గడిచిపోయాయో నాకు తెలియలేదు. అంతా సంతోషమే. కానీ ఆ సంతోషం తర్వాతే తెలిసింది ఆయన అసలు రూపం.

### అన్నీ దురలవాట్లే..

మందు, అమ్మాయిలూ, పేకాట.. ఇలా ఆయనకు లేని అలవాటు లేదు. చాలా బాధనిపించింది. భార్యని కదా.. వదిలేసి వెళ్లిపోలేను. అందుకే ఆయన్ని మార్చుకోవాలనుకున్నా. నా ప్రయత్నం తెచ్చిన మార్పును చూసి ఇక ఏ ఇబ్బందులూ ఉండవనుకున్నా. ఈలోగా మొదటి పాప కడుపులో పడింది. నాకు నెలలు నిండేసరికి అమ్మావాళ్లింటికి వెళ్లిపోయా. అత్తయ్య చనిపోవడం.. ఆ తర్వాత కొన్నాళ్లకే కామెర్లు వచ్చి మరిదీ పోవడంతో నా భర్త మానసికంగా కుంగిపోయారు. నేను తిరిగి అత్తింటికి వచ్చేసరికి ఆయన పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. విపరీతంగా తాగడం మొదలుపెట్టారు. దాన్నుంచి ఆయన్ను బయటకు తేవాలంటే ఆ ఊరి నుంచి దూరంగా ఉంటే మంచిదనిపించింది. అందుకే బంధువుల సలహాతో కాపురాన్ని ఒంగోలుకు మార్చుకున్నాం. రోజులు గడుస్తున్నా కానీ ఆయనలో మార్పు రాలేదు. ఆ రోజు నాకు ఇంకా గుర్తుంది. అప్పుడు రెండోపాపకు ఐదు నెలలుంటాయంతే. ఓ రోజంతా ఆయన ఇంటికి రాలేదు. ఆ మర్నాడు కొందరు స్నేహితులు ఫోను చేసి 'చక్రవర్తి ఎలా ఉన్నాడు' అని అడగడం మొదలుపెట్టారు. ఎప్పుడూ లేనిది అలా ఫోను చేసేసరికి ఎందుకో భయం వేసింది. కాసేపటికి కొందరు బంధువులూ ఇంటికొచ్చారు. 'చక్రవర్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు' అని చెప్పేసరికి నా మెదడు మొద్దుబారిపోయింది. రెండు మూడు రోజులు ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయాను. కొన్ని నెలలు గది నుంచి బయటకు రాలేదు. పిల్లల్ని చూస్తే ఏడుపొచ్చేసేది. కానీ ఏన్నాళ్లిలా.. వారిద్దరికోసమైనా నేను మళ్లీ మామూలు మనిషిని కావాలనుకున్నా.

### ఆధారపడకూడదనుకున్నా..

ఓ రోజు పాపను తిరిగి స్కూల్లో చేర్పించడానికి వెళ్లా. అక్కడ నా విషయం తెలుసుకున్న ఆ స్కూలు యాజమాన్యం ఉద్యోగం ఇస్తామన్నారు. నాకూ ఆసరా ఉంటుంది కాబట్టి వెంటనే చేరిపోయా. కానీ అప్పటి వరకూ ఆయన చేస్తున్న వ్యాపారం కుంటుపడింది. మీ వారు అప్పులు చేశారంటూ ఒక్కొక్కరూ ఇంటికి రావడం మొదలుపెట్టారు. కందుకూరులో ఉన్న ఓ ఇంటిని అమ్మేసి కొన్ని అప్పులు తీర్చా. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే.. కుంటుపడిన వ్యాపారాన్ని నడిపించాలనుకున్నా. నమ్మకంగా ఉన్న వ్యక్తే మోసం చేశాడు. తిరిగి నా మీదే తప్పుడు కేసులు బనాయించాడు. తగిన సాక్ష్యాధారాలు చూపించి బయటపడినా రూ.కోటి విలువైన ఆస్తుల్ని వదులుకోవాల్సి వచ్చింది. అప్పుడే చచ్చిపోవాలనుకున్నా. ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశా. కానీ పిల్లల జీవితం అన్యాయం అవుతుందని వెనకడుగేశా. బాగా ఆలోచించి ఎవరి మీదా ఆధారపడకుండా ఏదైనా చేయాలని అనిపించింది. అందుకే సొంతంగా వ్యవసాయం చేయాలనుకున్నా.

### ఇరవై ఎకరాల్లో మొదలుపెట్టా..

ఆయన చనిపోయాక వారి ఆస్తిలో ఒక్క రూపాయి కూడా నేను తీసుకోలేదు. ఆస్తి అంతా ఉమ్మడిలో ఉండిపోవడంతో నాకు పంచివ్వలేదు. ఆయన బతికున్నంత వరకూ కౌలురూపంలో అయినా కొంత ఆదాయం లభించేది. తర్వాత వాళ్లను అడిగితే ఇస్తామంటారే తప్ప చిల్లిగవ్వ చేతిలో పెట్టేవారు కాదు. పైగా బతుకుతెరువు కోసం వ్యవసాయం చేస్తానంటే.. సమర్థించకపోగా బంధువులు కొందరు 'ఆడపిల్ల గడపదాటి ఈ పనులన్నీ చేయడం అవసరమా!' అంటూ పెదర్థాలు తీయడం మొదలుపెట్టారు. కానీ ఆ మాటలు నాకెలాంటి సాయమూ చేయవని సర్దిచెప్పుకున్నా. పుట్టింటివారిచ్చిన ఐదెకరాలకు తోడుగా మరో ఇరవై ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేయడం మొదలుపెట్టా. కాలానికి తగినట్లుగా పంటలు వేయడంతో పాటు యూకలిప్టస్ కూడా వేశా. ఇదంతా చేస్తూనే ఎంకామ్ కూడా పూర్తిచేశా. ఈలోగా పంట చేతికి రావడంతో నా మీద నాకు కొంత నమ్మకం ఏర్పడింది. అలా వచ్చిన సొమ్ముతో మిగిలి ఉన్న కొంత అప్పు తీర్చా.

### నా మీదే తిరగబడ్డారు..

వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ కూడా చేయాలని అనిపించింది. అప్పటికే వ్యవసాయం కోసం, అప్పుల కోసం కొంత బంగారాన్నీ అమ్మేశా. మరికొంత తాకట్టుపెట్టి రుణం తీసుకున్నా. అప్పుడే అమ్మమ్మ నా పసుపు కుంకుమ కింద ఇచ్చిన ఎకరా భూమిని దీనికోసం వాడుకోవాలని నిర్ణయించుకున్నా. డెయిరీ పెట్టేందుకు బ్యాంకు నుంచి పాతిక లక్షలు రుణంగా తీసుకున్నా. ఇది తెలిసి బంధువులూ, ఇరుగుపొరుగూ 'డెయిరీ అంటే బాగా కష్టపడాలి. ఆడదానివి చేయలేవు. ఆలోచించుకో' అన్నారు. కానీ ఎంత కష్టమైనా ముందడుగు వేయాలనుకున్నా. కానీ మా పొలానికి చుట్టుపక్కల వాళ్లంతా 'అక్కడ డెయిరీ పెట్టడానికి వీల్లేదంటే.. వీల్లేదు' అన్నారు. దాని కట్టడాన్ని ఆపేయమంటూ బెదిరించారు. సర్వేయర్‌ను, కరెంటు ఇచ్చేవారిని అడ్డగించారు. ఒక దశలో అయితే కొట్టబోయారు కూడా. నేను వాటికీ భయపడలేదు. పట్టు వదలకుండా ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగేదాన్ని. వాళ్లూ నా బాధను అర్థం చేసుకుని అవకాశం ఇచ్చారు. నిర్మాణం పూర్తయ్యింది. 45 మేలు జాతి గేదెలు, మరో ఇరవై ఆవులను కొని డెయిరీ మొదలుపెట్టా. దాన్నుంచి వచ్చే పాలల్లో 80 శాతం ఓ ప్రైవేటు డెయిరీకి అందిస్తున్నా. తెల్లవారుజామున మూడు గంటలకే నా పని మొదలవుతుంది. పిల్లల్ని ఇంట్లోనే వదిలేసి తాళం పెట్టి డెయిరీకి వచ్చేస్తా. తిరిగి ఇంటికి చేరుకుని వాళ్లను తయారుచేసి బడికి పంపిస్తా. ఇంకా కొంత అప్పు ఉంది. త్వరలో దాన్నీ పూర్తిచేస్తా. ఇప్పుడు నాకంటూ కొంత ఆదాయం ఉంది. అందరూ కాదన్న చోట.. జాలి చూపించిన చోటే నేను స్థిరంగా నిలబడగలగడం నాకెంతో సంతృప్తినిస్తోంది. పెళ్లి, ఆస్తులు, అంతస్తులు నిలబెట్టలేని నా జీవితాన్ని ఆత్మస్థైర్యమే ఆదుకుందని గర్వంగా చెప్పగలను. అలా కాకుండా ఆత్మహత్య చేసుకుని ఉంటే.. నా పిల్లలు ఏమయ్యేవారో. కానీ ఆ రోజున సరైన నిర్ణయం తీసుకుని ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కొన్నందుకు ఇప్పుడు ఆనందంగా ఉంది.

# కమిషనర్ ఆదేశాలతో..





- రోడ్డుపై మురుగు, ఆక్రమణల తొలగింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వీధుల్లో కాలువలు నిండిపోవడానికి కారణమైన ఆక్రమణలను కమిషనర్ ప్రసాదరావు ఆదేశాల మేరకు తొలగించారు. వీధుల్లో నీరు నిలిచిపోతున్న నేపథ్యంలో కమిషనర్ సూచనల మేరకు హెల్తాఫీసర్ సుధీర్ దగ్గరుండి సిల్ట్ కత్తెరవీధి, రాజరాజేశ్వరి పీఠం, తుమ్మావీధుల్లో ఆక్రమణలు, రోడ్డుపై మట్టి దిబ్బలు, ఇటీవల తీసిన సిల్ట్‌ను తరలించే పనులు శుక్రవారం చేయించారు. సిల్ట్‌తీతకు ఇబ్బందికరంగా స్థానికులు కాలువలపై స్లాబ్‌లు, పలకలు వేసేసిన నేపథ్యంలో దగ్గరుండి వాటిని తొలగించారు. అలాగే వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా నిలిపేసిన ఆటోలను అక్కడి నుంచి తీయించారు. వర్షాల కారణంగా రోడ్డుపై మురుగు, నీరు నిలిచిపోకుండా జేసీబీను పెట్టి ట్రాక్టర్ల ద్వారా మట్టిదిబ్బలు, సిల్ట్ తరలింపు చర్యలు చేపట్టారు. పనుల పరిశీలనలో టీడీపీ నాయకులు గుడి చంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, శానిటరీ మేస్త్రి కృష్ణ, ఈశ్వరరావు, శానిటరీ వర్కర్స్ పాల్గొన్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.